


రమ్యాణి వీక్ష్య మధురాణి నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితోపి జంతుః!
తచ్చేతసా స్మరతి మూన మబోధ పూర్వమ్-
భావ స్థిరాణి జననాంతర సౌహృదాని!!

హృద్యమైన భావాన్ని హృద్యంగమంగా గానం చేస్తున్న అతనెవరో చూడాలనే కుతూహలం ఆపుకోలేకపోయింది శిరీష.

లెక్చరర్స్ రాని పీరియడ్స్‌లో సీనియర్ స్టూడెంట్స్ చివరి బెంచిల్లో చేరి అమ్మాయిలపైన కామెంట్స్ విసరటం తరచూ జరిగేదే.

ఆ కామెంట్ కూడా అలాంటిదే కావచ్చు. ఎవరి గురించో అయి వుండవచ్చు. అయినా చూడాలని మనసు సొదపెట్టడంతో ఠక్కున వెనక్కి తిరిగింది. ''వహ్వా... వహ్వా...'' అరిచారు అతని చూట్టూ మూక.

అది వినపడలేదు శిరీషకు. తన్మయత్వంతో పాడుతున్న అతనిపై నిలిచపోయింది చూపు. 'సాధారణంగా ఉన్న దుస్తుల వెనుక హుందాగా ఉన్న విగ్రహం. మేఘానికి మెరుపులాంటి గంభీర స్వరం; తేజో పుంజం లాంటి

వదనం.' అనుకోకుండా ఉండలేకపోయింది.

''నీ దిక్కు మాలిన సంస్కృతంతో చంపక, తెలుగులో ఏడువ్!'' పక్కనున్న డిప్పకటింగ్ మాట పూర్తికాకుండానే అతడుకళ్లు తెరిచాడు తపో భంగమైన ఋషిలా.

''సంస్కృతం దిక్కుమాలిందంటే చంపేస్తా!'' నాతి కఠినంగానే అన్నా హృదయాన్ని కదిలించే మందలింపు అది.'' సంస్కృతం దిక్కుమాలింది కాదురా! ప్రపంచ భాషలన్నిటికీ దిక్కైంది. మధురమైన భావాన్ని మృదువైన పదాల్లో పొందుపరిచిన మహాకవి కాళిదాసు కలం నుండి జాలువారిన శ్లోకమది.

''సుందర రూపాలను చూసినప్పుడు, మధుర శబ్దాలను విన్నప్పుడు సుఖంగా ఉన్న ప్రాణి కూడా పర్యుత్సుతకను పొందడం సహజం............'' గొప్ప పండితుడిలా విశ్లేషించాడు.

''అబ్బే! ఇందులో కొంచెమే అర్థమైందిరా!'' బుర్ర గోక్కున్నాడో మట్టిబుర్ర.

''అందుకే గదరా నిన్ను Half Knowledge అని ముద్దుగా పిలుస్తా'' అన్నాడు వెంటనే పక్కనున్న పీలా.

''ఒక్క మాటలో ఆ శ్లోకానికి అర్థం చెప్పరా!'' అర్థించాడో 'అరటన్ను' శాల్తీ.

'' ఇదే విషయాన్ని కీట్స్ A thing of beauty is a joy for ever అని చెప్పాడు మళ్లీ అతడు.

'' ఓహ్! బ్యూటీఫుల్!'' అందరూ అరిచారు కోరస్‌గా.

లెక్చరర్ వస్తున్న అలికిడి విని ఒక్కొక్కరే బయటికి వెళ్ళిపోసాగారు.

ఓరకంట అతడినే చూస్తున్న శిరీష. అతను తన బెంచి దాటుతుంటే ముడివడ్డ పెదవుల్ని విప్పార్చింది.

'హలా మాధురి!'' అదే క్షణంలో ఆమె కళ్లలోకి చూస్తూ గుసగుసగా అన్నట్లనేసి గబగబా వెళ్ళిపోయాడు.

షాక్‌నుండి తేరుకునేందుకు చాలా సమయం పట్టింది శిరీషకు. అయితే బాగా ఆలోచించిన మీదట ఆ మాటల వెనుక ఏదో అర్థం ఉండి వుంటుందని భావించి, సాహిత్య శిల్పం తిరగేసి, ఆశ్చర్యపోయింది.''భావం స్పష్టంగా వ్యక్తం చేసేది. అభరణాలు లేకున్నా అందంగా ఉండేది''

అప్పుడే అతనిపట్ల ఒక ప్రత్యేకమైన ఆసక్తి చిగురు తొడిగింది. అది అంతకు ముందు ఎవరి పట్లా కల్గని అభిమానం. విచిత్రమైన అనుభూతి. బహుశా దాన్ని ప్రేమ అనవచ్చునేమో!.

★ ★ ★

గత రెండ్రోజులుగా అతను కనిపించడంలేదు. అతని కోసం వెతికి వెతికి కళ్లు అలసిపోయాయి. ఎవర్నైనా అడుగుదామంటే మొహమాటం. పరధ్యానంగా కాలేజీ లైబ్రరీ నుండి బయటికొస్తున్న శిరీష మరీ దగ్గరిగా వచ్చాక గానీ చూసుకోలేదు.

''హలో!'' తట్టుకోలేని టెన్షన్‌నుండి ఆ రెండక్షరాలు ఆమెను బయటపడేశాయి. ఎంతో గట్టిగా అన్నాననుకుంది. కాని, అతి చేరువగా ఆమెనే గమనించకపోతే అతనా మాటల్ని రిసీవ్ చేసుకోలేకపోయేవాడు.

''నమస్తే!'' కళ్లతోనే నమస్కరించాడు. పెదాలూ చూపులూ ముక్కోణాకారంగా మారి మొనదేలిన సుమశరంలా శిరీష గుండె గదుల్లోకి దూసుకొని పోయి గిలిగింతలు పెట్టాయి.

కాలం నిలిచిపోయినట్లైంది.

''మీపేరు?'' కదిలించాడతనే.

'' శిరీష' టక్కున చెప్పింది., ముందే ప్రిపేర్ అయినట్లు.

'' ఓహ్! దిరిసెన పువ్వా! అందుకే అంతలలితంగా'' కళ్లలో నవ్వు కలిసిపోయింది.

'చూపులు కలసిన శుభవేళలా ఉంది శిరీషకు. అతను కదిలిపోబోతుంటే ఆ దుర్దాగా అడిగింది. ''మీరు...''

''నవ్వుకోనంటే చెబుతాను.... యాచకుడ్ని'' మొహమాటం, ఆత్మ న్యూనతా లేవు. మొహంలో చెరగలేదు నవ్వు.''అదికాదు.. మీపేరు...''

అపార్థం చేసుకున్నాడేమోనన్న అంతర్మథనం తొంగిచూసింది శిరీష మొహంలో.

అఫ్‌కోర్స్! నాపేరు కూడా యాచకుడే. బి. ఏ. ఫైనల్. యల్ (బి. ఎ. (ఎల్)'' చివరి అక్షరాన్ని వత్తి పలికాడు.

''అర్థమయ్యేలా చెప్పండి'' మచ్చలేని అమాయకత్వం.

''పూవులకా మాత్రం అర్థం కాదంటే నమ్మమంటారా?'' మళ్లీ అతని

చూపుల విరి తూపులు, ఆమె చుట్టూ.

వరండా చివర్లో మిడదతల దండు (అతని స్నేహితులకు శిరీషపెట్టుకున్న పేరు) కనబడింది.

''వస్తా'' నంటూ అడుగులు సవరించుకునే ప్రయత్నం చేసింది శిరీష.

★ ★ ★

''చూచి ఝళం ఝళత్ కటక సూచిత వేగ పదారవిందయై, లేచి కుచంబులందురుము లేనడు మల్లల నాడ... ఓహ్! పెద్దన ఎంతటి రసికాగ్రగణ్యుడు కదూ!'' లైబ్రరీలో పుస్తకాల ర్యాక్‌కు రెండో పక్క నిలబడి మను చరిత్రలోని పద్యం వినిపిస్తూ వ్యాఖ్యానిస్తున్న అతడ్ని మేను మరచి చూస్తోంది శిరీష.

శనివారం సాయంత్రం లైబ్రరీకి తమ సమాగమ స్థలంగా నిర్దేశించుకున్నారు. సాహిత్యానికీ, ప్రేమకూ సహృదయానికీ-సరసానికీ అదే అనువైన ఏకాంత మనునకున్నారు గాబోలు.

అధరోష్ఠాలను వేరు చేసి, అరవిరిసిన పుష్పంలా తదేకంగా తననే చూస్తున్న ఆ బింబాధరిని చూడగానే పెద్దన ముద్దుల పద్యం అతని మానస పరోవరంలో రాజహంస అయింది. 'యాచకుడు' అనే మాట గుర్తొచ్చి ఫక్కున నవ్వింది.

''ఏం చేస్తున్నారక్కడ? ఆఁ!'' కళ్లజోడు సరిజేసుకుంటూ ఆడ గొంతు మగలైబ్రేరియన్ గబగబా వచ్చాడక్కడికి.

''పుస్తకాలు...'' నసిగింది శిరీష.

''సరి, సరి, టైమైపోయిందిగా వెళ్లండి!'' కళ్లజోడు మరోసారి సర్దుకున్నాడు లైబ్రేరియన్ రామలింగం.

''కత్తి!' పళ్లు నూరుతూ మెల్లగా వత్తి పలికాడు అతడు, శిరీషకు మాత్రమే వినబడేలా.'కన్నడంలో'' అన్నాడు చివర్లో.

కిసుక్కున నవ్వింది శిరీష. (కన్నడంలో కత్తి అంటే గాడిద అనే అర్థం)

''వెళ్లమన్నాగా!'' మరోసారి జోడు సరిజేసుకోక తప్పలేదు రామలింగానికి.

శిరీష తలయెత్తి చూసేసరికి గడపదాటి 'బై! దీపూ!''అంటూ వెళ్తున్నాడు (దిరిసెన పువ్వులోని రెండు పదాల మొదటి అక్షరాలకూ దీర్ఘాలు చేర్చి తననలాపిలవడం శిరీషకెంతో ఇష్టం).

కథా నిలయం
4816

పేరు చెప్పకుండా మెలికపెట్టి తన ఆలోచనలన్నిటినీ అతని చుట్టే తిప్పుకుంటున్న అతనిపై కోపం, అభిమానం, ప్రేమ సమపాళ్లలో కలిగాయి.

''యాచకుడనేది శివుడికి పర్యాయం. అయితే పూలతో శివుడికి గల సంబంధంతో నీపేరు ముడిపడి ఉందన్న మాట. అదీ త్వరలోనే తెలుసుకుంటా'' ననుకుంది మనసులో.

★ ★ ★

''దీపూ!'' దీపూ! దీపూ!'' ప్రతిక్షణం పుష్పం చుట్టూ వినిపించే భ్రమర నాదంలా శిరీష హృదయ తంత్రుల్ని కదిలిస్తున్న శబ్ద స్పర్శ అనుక్షణం కర్ణపుటాల్లో మార్మోగుతుంది. తన పేరులో ఏమాత్రం నవ్యతా, ఆకర్షణా లేదని నిరుత్సాహంగా ఉండే శిరీషకు, ''దిరిసెన పువ్వు'' అనే పేరులో ఇంత మాధుర్యముందా? అనిపించింది. ఆ పేరు ప్రియుని నోట వికసించే పుష్పంలా'' ''దీపూ!'' అని వినపడ్డప్పుడల్లా చెప్పలేని పులకింత చిగురిస్తుంది.

ఆరోజు రెండు వేర్వేరు యూనియన్ల విద్యార్థులు పోట్లాడుకొని తరగతులు బహిష్కరించారు. కలకలంగా ఉండే క్యాంపస్ కళావిహీనమైంది. తరగతులు బోసిపోయినాయి.

ఏకాంతంగా తరగతి గదిలో కూర్చొని, తల బెంచినానుకుని ఉన్న టేబుల్‌పై ఆన్చి ఆలోచనగా తరంగితలా కూర్చున్నది శిరీష.

'' ఇంకా ఎంతసేపు నిరీక్షించాలో?'' తన చెవి దగ్గర గుసగుసగా వినిపించిన మధుర స్వరానికి ఉలిక్కిపడి లేచింది.

టేబుల్‌పై మోచేతులానించి కళ్లలోకి చూస్తున్నాడు 'యాచకుడు'.

మనస్సు ఒక్కసారిగా సంతోషంతో నిండిపోయింది. అంతలోనే కోపం ముంచుకొొచ్చింది.''నన్ను మాట్లాడించొద్దు''.

నను, భదీయ దాసుని, మనంబున నెయ్యపు కిన్కబూని ''తిట్టిన'' యది నాకు మన్ననయె! చెల్వగునీ........'' ముక్కు తిమ్మన్న చక్కని పద్యానందుకున్నడు.

'' ఆపు!'' చిరుకోపంతో శిరీష.

'' ఆజ్ఞ!''కుడిచేయి మడిచి అభివందనం చేశాడు.

నవ్వునాపుకోలేకపోయింది.

'' ఇంతకూ అంత కోపమెందుకో సౌకుమార్యానికి తాపం క్షేమకరం కాదు సుమా! అది నిన్ను కాల్చేయడమే కాదు ఎదుటివాళ్ల ఆనందాన్నంతా

నీరు కార్చేస్తుంది కూడా!'' అన్నాడు.

'' ఏంటీ? ఆశు కవిత్వమూ?'' కళ్లు తెరిచింది.

''అంత భాగ్యమా?'వాణి నా రాణి' అని సగర్వంగా చెప్పుకున్న ప్రౌఢకవి పిల్లల మర్రి పిన వీరభద్రుని కవితా ఝరి''.

అటెండర్ గదికి తాళం వేసేందుకుపక్రమిస్తుండగా ఇద్దరూ నెమ్మదిగా బయటికి నడిచారు.

'' ఇంతకూ ఈ సుమబాల కోపకారణం అవగతం కాలేదు.''. శిరీష కరకమాలాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

''ఇన్నాళ్లుగా చూస్తూన్నాను. మీ ఇంటికి రమ్మని ఒక్కసారైనా పిలవలేదేం?'' కళ్లల్లోకి చూసింది. నిలదీసినట్లు.

అంతవరకూ ఉత్సాహంగా ఉన్న అతడు గంభీరంగా మారిపోయాడు. ఆ తర్వాత కూడగట్టుకున్నట్లు అన్నాడు నెమ్మదిగా. ''చెప్పానుగా, నేను.... యాచకుడ్నని. పిలిచి చూపించడానికి ఈ పేద....''

ప్లీజ్ మళ్లీ ఆ మాటనకు. ఇట్స్‌మై రిక్వెస్ట్. నేను బాగా ఆలోచించాను. నీవు యాచకుడివంటే శివుడివి శివుడికున్న అనేక నామాల్లో నీ పేరేదో త్వరలోనే తెలుసుకుంటాను. ఒకవేళ నిజంగా నీవు యాచకుడివే అయితే నీకు నా సర్వం ధారపోస్తాను. దయ చేసి నీనుండి నన్ను దూరం చేయకు. అంటూ తన అశ్రు నయనాలకు అతని చేతిని ఆనించుకుంది.

★ ★ ★

అదొక అందమైన ఉద్యానవనం. పిండి ఆరబోసినట్లు వెన్నెల, సన్నని తుహిన వీచికలు, గిరికన్యను ఆకాశరాజుతో కలుపుతూ ప్రేమ కురిపిస్తున్న పూలజల్లులా ఉంది. మబ్బును చూసి వర్తించే మయూరిలా నడకవేగం పెంచింది.

తెలియకుండానే గమ్యం చేరుకున్నది. అది ఇల్లుకాదు. లతాకుంజాలు గజిబిజిగా అల్లుకున్న పూలపొదరిల్లు. లోపలికడుగు పెడుతుంటే పై కప్పు నుండి క్రిందికి తొంగి చూస్తున్న దిరిసెన పూలు శిరీష నుదుటిని ముద్దాడాయి. అప్పుడర్థమైంది. దిరిసెన పూవు ఎంత కోమలంగా మరెంత ఆకర్షణీయంగా ఉంటుందో!.

రేకులన్నీ విచ్చుకొని సాదరంగా నవ్వాయి. ''నువ్వూ మేమూ ఒక్కటే!''

అంటున్న శిరీష పుష్పాలను తన కోమల హస్తాలతో పట్టుకొని, చెక్కిళ్ళ కద్దుకున్నది.''ఏమీ హాయిలే హలా!'' అన్నాయి ఆనందంగా పూలు!

''అక్కడే నిలబడ్డావేం? ఈ యాచకుడ్ని కరుణించేందుకు లోపలికిరావా! దేవేరీ!'' శృతి చేసిన వీణను లయబద్ధంగా సవరిస్తున్న అతని పిలుపు.

అప్పుడు గుర్తుకొచ్చిందతనికి పేరు.''మధు... మధు...''

★ ★ ★

''ఏమైందేనీకు! ఎంత పిలిచినా లేవవేం?'' విసుక్కుంటున్న తల్లి అరుపులతో ఉలిక్కి పడి లేచింది శిరీష. శరీరమంతా చెమటతో తడిసిముద్దైంది.

'' ఏమిటి, సాయంత్రం ఎవరో ఫ్రెండింట ఫంక్షన్‌కి వెళ్లాలన్నావుగా! ఏడుగా వస్తుంది. ఏంటా మొద్దునిద్ర? ఇదిగో నీ ఫ్రెండ్ ఎవరో ఈ లెటర్ ఇచ్చి వెళ్ళింది. అంటూ ఓ ఎన్వెలప్ ఇచ్చింది.

''ఛ! ఇంతవరకూ తనుకలగందా? అయినా ఎంత బాగుంది. అనుకుంది ఒళ్లు విరుచుకుంటూ. అంతలోనే తల్లి అన్న మాట గుర్తుకొచ్చింది. టైమ్ ఏడు గంటలా! ఉహ్! లెటర్ గిటర్ జాన్‌తానై. అంటూ ఆ కవర్ విసిరేయబోయి, **From Address** ''యాచక '' అనే పదం కనబడగానే కవరు చించి గబగబా మడతలు విప్పింది.

''ప్రియమైన దీపూ!

''నువ్వు దిరిసెన పువ్వువైతే నేను మధుపత్రాన్నై, నీవు రవళివైతే నేను మురళినై, నీవు శృతివైతే నేను రాగాన్నై జీవన బృందావనంలో హాయిగా మందమారుతం కావాలనుకున్నాను.

''నీ సౌందర్యారాధనలో ప్రతిక్షణం రసరమ్యంగా గడిపేయాలన్న నా ఆలోచనకు సాహిత్యమే ప్రాణం పోసింది. ఆ అమృత మధనంలో ఒక్కొక్క దివ్యఫలం లభిస్తుంటే ఉక్కిరిబిక్కిరి అయిపోతూ హఠాత్తుగా నీ ప్రేమ జోత్స్నసరోవరంలో రాజహంస నయ్యాను.

''నేను యాచకుడ్నే. పౌరోహిత్యంతో కడుపు నింపుకునే మా వృత్తి యాచకవృత్తే. భిక్షాటనం చేయకున్నా మా నాన్నగారు పోయే నాటికి

మేం'పెద్దమ్మ'కు దగ్గరి బంధువులమే అయినా నా ప్రవృత్తితోనేగాని, వృత్తితో సంబంధం లేదు కదా! ఆత్మీయత, మమతేగాని, కులమతాల మకిలం అంటుతుందా?

''ప్రేమ, భక్తి స్థాయిలో భేదాలున్నా భావనా బలంలో దేనికదే బలీయమైంది.''

''మొన్న సాయంత్రం ఓ స్నేహితుని బలవంతం మీద మఠంవారి కార్యక్రమంలోపాల్గొన్నాను. ప్రేమ, భక్తితోపాటు సేవకున్న ప్రాధాన్యాన్ని గురించి, ఆ సభలో 'స్వామీజీ' అద్భుతమయిన విషయాలు చెప్పారు. సేవ చేయలేని జీవితం నిరర్థకమనిపించింది.

''ఇన్నాళ్లూ అమ్మవారిని జ్ఞానబిక్షను యాచించాను. భక్తుల ఈప్సితాల నీడేర్చమని 'శాంతి'ని యాచించాను. శృంగార రసాధి దేవతగానిన్ను భావించి నీ ప్రేమను యాచించాను.

'' ఇప్పుడు మనకందరికీ తల్లియైన భరతమాతను నాకు మనో నిగ్రహాన్ని, ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించమని యాచిస్తున్నాను.

''గత 49 గంటలుగా ఆలోచించిన మీదట నేనీ నిర్ణయానికొచ్చాను. రేపటి నుండి ఆదిలాబాద్‌లో ప్రారంభమయ్యే రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వారి శిక్షావర్గలో పాల్గొనేందుకు ఇప్పుడు బయల్దేరుతున్నాను.

'' ఆపై వనవాసీ కళ్యాణ క్షేత్రంలో గిరిజన కళ్యాణార్థం కృషి చేసేందుకు కనీసం నాలుగు సంవత్సరాలు ప్రకృతి ఆరాధనలో, సేవలో గడిపేందుకు సంసిద్ధమయ్యాను.

ఇది పలాయనవాదంగా భావించవని నానమ్మకం త్యాగరహితమైన ప్రేమభక్తి పతనానికి, వినాశనానికే కారణమౌతుందట. అలాగని నీ ప్రేమను నాకోసం త్యాగం చేయమని కానీ నీపై ప్రేమను నేను త్యాగం చేస్తున్నాననే విపరీత భావన కానీనాకు లేదు.

''నీ సాహచర్యలో ఈ హృదయానికి లభించిన మధురానుభూతి అవిస్మరణీయం. మనసుకలల్లో విహరించేందుకు తపిస్తుంది. జీవితం అనుభవాల కోసం ఆరాటపడుతుంది. ఈ రెండింటిని సక్రమమైన మార్గంలో సమన్వయ పరచి ఆనందాన్నందుకోగల వారే సాధకులు.

'' నేను దాంపత్య జీవితం ప్రారంభించాలనుకునే రోజు వస్తే. నీ గురించే ముందుగా ఆలోచిస్తాను. అందుకోసం నీ మనసునూ, పరిస్థితులనూ ఎదిరించి

నా కోసం నిరీక్షించనవసరంలేదు.

''ప్రేమల్లో మాతృప్రేమ గొప్పది. ఋణాల్లో మాతృదేశ ఋణం భారమైంది. అది చెల్లించుకునే అదృష్టం అవకాశం రూపంలో నా హృదయ గవాక్షం తట్టింది. నా అదృష్టం నీకు దురదృష్టం కాకూడదనే నాకోరిక.

''నా పేరు తెలుసుకొనే ఉంటావు. నేను మధువు నాశించే తుమ్మెదనో, మదన కుతూహలం గల కాముకుడినో, భిక్షాన్ని స్వీకరించే భిక్షుకుడినో నా పేరు ''మధూకర్''.

''నా నిర్ణయాన్ని హృదయపూర్వకంగా ఆమోదించాలని యాచిస్తూ....

నీ

''యాచకుడు''

*(జాగృతి 7 – 13 సెప్టెంబరు , 1998 వారపత్రిక )*